క్లుప్తంగా

బుద్ధుని బోధనలు ఆచరణీయం



బుద్ధుని జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విశ్వ మానవాళికి ప్రేమ తత్వాన్ని, అహింసను బోధించిన బుద్ధుని బోధనలు ఆచరణీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయం నందు గౌతమ బుద్ధుని జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచ శాంతిని కోరేలా మనుషులందరూ సమానమని చెబుతున్నాయన్నారు. అజ్ఞానాన్ని వీడి జ్ఞానాన్ని పొందాలని ప్రబోధించారన్నారు. సంస్థ చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేశారని, ప్రతి మనిషి బుద్ధుని బోధనలు ఆచరించి నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ సంస్థ కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ, పులుకులూరి చిన్నబాబు, కాశీ గౌతమ్, రాచేటి ఎఫ్రెయిన్ కుమార్, వినుకొండ సంజన, అరవిస్, టైటాస్ రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నగరపాలక సంస్థ వెహికల్ డిపో వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లకు గత నెల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, డిసెంబర్ సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఏలూరు నగరపాలక సంస్థ వెహికల్ డిపో వద్ద క్లాప్ ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ క్లాప్ ఆటోల డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 27 నుంచి నిరవధిక ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటోల డ్రైవర్లు రాజు, గణేష్, సుగుణరావు, సుబ్బారావు, రాజేష్ పాల్గొన్నారు.










స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్చుకుంటున్న చిన్నారులు

స్విమ్మింగ్ పూల్.. సమ్మర్‌లో కూల్..

వేసవి సెలవుల్లో భాగంగా విద్యార్థులకు స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న విశ్వనాథ్ బత్తియ్య స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్పుతున్నారు. ఈమేరకు స్విమ్మింగ్ పూల్ హాల్‌లో జిమ్, మహిళలకు ప్రత్యేక వసతులను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్ పూల్ నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేసి క్రిమి కీటకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్విమ్మింగ్‌తో మానసిక ఉల్లాసం, శారీరిక ధృఢత్వం ఉంటుందని కోచ్ గణేష్ తెలిపారు. వేసవికాలంలో స్విమ్మింగ్ శిక్షణ కోసం నగరంలోని చిన్నారులు పెద్దెత్తున వస్తున్నారని చెప్పారు. ఈ స్విమ్మింగ్ పూల్‌ను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలి



మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీహెచ్ మెహరాజ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ కౌన్సిలర్, నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కోఆర్డినేటర్ జీ ప్రవీణ్ కృష్ణ, వొకేషనల్ గైడెన్స్ కోర్సు సీఈఓ వీ. వరలక్ష్మి మాట్లాడుతూ ఐటీఐ విద్యార్థులు స్కిల్ వర్క్ బాగా నేర్చుకుని స్వయం ఉపాధి పొందుతూ అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెట్‌వెల్ పర్యవేక్షకుడు కేజే కెనడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భర్త తనను వేధిస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంగిడిగూడెం గ్రామానికి చెందిన మాండ్రు జ్యోతికి అదే గ్రామానికి చెందిన నాగార్జునతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. చెడు వ్యసనాలకు బానిసైన నాగార్జున గత కొంతకాలంగా జ్యోతిని మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న నాగార్జున జ్యోతితో గొడవ పడి తీవ్రంగా కొట్టడంతో గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జ్యోతి ఫిర్యాదుతో వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూలవేతనం ప్రకారం జీతాలు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లకు మూలవేతనం ప్రకారం జీతాలు చెల్లించాలని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు కోరారు. దీనిపై యూనియన్ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన పీహెచ్ అండ్ నాన్ పీహెచ్ వర్కర్లకు సంబంధించి 9 మందికి 2022 ఏప్రిల్‌కు ముందే పీహెచ్ డ్రైవర్లుగా పదోన్నతి ఇచ్చారన్నారు. పదోన్నతి కల్పించి రెండేళ్లు కావస్తున్నా డ్రైవర్లకు మూలవేతనం ప్రకారం జీతాలు ఇవ్వకుండా వర్కర్ జీతం ఇస్తున్నారని ఆరోపించారు. నెలకు రూ.5వేలు చొప్పున గత రెండేళ్లుగా ఒక్కో ఉద్యోగి రూ.1.20 లక్షల వరకూ నష్టపోవడం జరిగిందన్నారు. వీరి పదోన్నతులపై నగరపాలకసంస్థ కమిషనర్, అదనపు కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంబంధిత డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీర్ తదితర అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని డ్రైవర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు డి.అప్పారావు, ట్రాక్టర్ డ్రైవర్లు ఉన్నారు.

ఏలూరు జిల్లాలో వైఎస్సార్ సీపీదే విజయం..



గారపాటి నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ, ఏలూరు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ఓటర్లు ఏకపక్షంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేశారని, రానున్న ఫలితాల్లో అది స్పష్టంగా కనిపించనుందని, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ఎన్నిక తథ్యం అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమకావడం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. లబ్ధి పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు అందరూ వైఎస్సార్ సీపీకే తమ ఓట్లు వేయడం కన్పించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించనున్నారని తెలిపారు. ప్రజల స్పందన చూస్తే ఇది అర్థం అవుతుందన్నారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో జిల్లాలోని అందరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని గారపాటి నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకం పనులను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు రూరల్ మండలం కోమటిలంక సర్పంచ్ తెనాలి యోహాన్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఏలూరు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓని కలిసి మాట్లాడారు. గ్రామంలో మద్దుల రత్నం, టీడీపీ నాయకుడు ముంగర నాగరాజు, పెనుగొండ శేఖర్, జొన్నగడ్డ రాజేష్ అనే వ్యక్తులు ఉపాధి పనులు చేస్తున్న కూలీలను రెచ్చగొట్టి పనులు అడ్డుకుంటున్నారని వివరించారు. పనులు చేయకుండానే మస్తర్లు వేసి వేతనాలు చెల్లించాలని మేట్లపై ఒత్తిడి చేస్తున్నారని తెలియజేశారు. వృద్ధులు, వికలాంగులతో చిన్నపాటి పనులు చేపట్టి మస్తర్లు వేస్తుంటే, అక్రమాలు జరిగినట్టుగా పత్రికల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ మేట్ సహకారంతో కూలీల మధ్య వర్గ, వైషమ్యాలు సృష్టిస్తున్నారని అన్నారు. పనులు చేయకుండానే తమకు నచ్చిన కూలీలకు మస్తర్లు వేసి వేతనాలు చెల్లించాలని మేట్లపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. మాట వినని మేట్లను తొలిగించేందుకు అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. గ్రామాభివృద్ధిలో ఉపాధి పనులు కీలకభూమిక పోషిస్తున్నాయని, ఉపాధి పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వెన్నవెల్లివారి పేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నందు సంఘం అధ్యక్షుడు బొల్లే సీతారామయ్య అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బొల్లే సీతారామయ్య, కార్యదర్శిగా దుగ్గిపోతు రాజాలాల్, కోశాధికారిగా మామిళ్ల రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షులుగా దావూరి భాగ్యరెడ్డి, మామిళ్ల దుర్గ, సహాయ కార్యదర్శిగా తాటిపూడి అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దోమ పద్మ, ఆఫీసు కార్యదర్శిగా నంబూరి బిజిత, కార్యవర్గ సభ్యులుగా మెండెం చందు, కంటిపోగు అంజలి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు నాయకులు, సభ్యులు అభినందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	16

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

దెందులూరు: సీసీకెమెరాలను, వీడియోఫుటేజీలను ప్రతి రోజూ మూడు సార్లు పోలీస్ భద్రతా సిబ్బంది తనిఖీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బీ.లావణ్యవేణి ఆదేశించారు. గురువారం దెందులూరు నియోజకవర్గ పోలింగ్‌బ్యాలెట్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. మూడంచెల భద్రతను పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేసి పర్యవేక్షణాధికారిగా సంతకం చేశారు. కౌంటింగ్ వరకు మూడంచెల భద్రతా వ్యవస్థ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

త్వరలో విర్డ్ సేవలను విస్తరిస్తాం

ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ సుధాకరరావు వెల్లడి

ద్వారకాతిరుమల: విర్డ్ హాస్పిటల్లో జనరల్ సర్జరి, ఈఎన్‌టీలో ఆరోగ్యశ్రీ సేవలను త్వరలో రోగులకు అందుబాటులోకి తెస్తామని హాస్పిటల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. స్థానిక విర్డ్‌లో చైర్మన్ సుధాకరరావు అధ్యక్షతన గురువారం ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 23 మంది దివ్యాంగులకు కాలిపర్స్, అలాగే ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకున్న వారికి అత్యాధునిక కృత్రిమ అవయవాలను చైర్మన్ సుధాకరరావు, వైస్ చైర్మన్ వేగేశ్న ఆనందరాజు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణ మూర్తి, ఎంఎం గుప్తా, చెలికాని రాజమోహనరావు, కేఎస్ఎస్ వంశీ, శ్రీవారి దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు అందజేశారు. గుప్తా ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కాలిపర్స్‌ను అందజేసినట్టు ఈ సందర్భంగా సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు భవ్యాచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఏవో ఉదయ శ్రీ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవాలు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం ఆలయంలో స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు పర్యవేక్షణలో సుదీరాచార్యులు, మోహన కృష్ణాచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో చక్రస్నానం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు విశేష పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దలు నీలంశెట్టి రాంబాబు, ఈవో వంశీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల మెరుగుకు సమ్మర్ క్యాంపులు దోహదం



చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.తాగూర్ రాజా అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు విద్యా, విజ్ఞానం, వినోదం అందించే లక్ష్యంతో హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లా గ్రంథాలయం, బాలల గ్రంథాలయం, జింగిల్ బెల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. ఈ క్యాంపులలో విద్యార్థులకు చిత్రలేఖనం, సంగీతం, డ్యాన్స్, ఆడపిల్లలకు గుడ్ టచ్, బాడ్ టచ్, సెల్ఫ్ ట్రిక్స్ నేర్పుతున్నట్లు తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల జీవిత విశేషాలు తెలియజేస్తున్నట్లు వివరించారు. చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్, క్యాంప్ నిర్వాహకులు జి.శారద, సీహెచ్ రాజేశ్వరి, యు.దుర్గా, పవన్ తదితరులు రిసోర్స్‌పర్సన్లుగా బోధిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు సందీప్, ఇస్లామ్, కీర్తి, శోభా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న విద్యుత్ సంస్థ అధికారులు, సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవిలో దాహార్తులకు తాగునీరు, మజ్జిగ అందించడం పుణ్యకార్యమని తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరు పీ సాల్మన్ రాజు చెప్పారు. స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులచే ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రంలో గురువారం ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ గత ఏప్రిల్ 14వ తేదీ నుంచి రోజుకి 150 లీటర్ల పైగా మజ్జిగను రోజుకు వెయ్యి మందికి పైగా ప్రజలకు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు, విద్యుత్ శాఖ ఈఈ జేపీబీ నటరాజన్, అదనపు ఈఈ డీ.ప్రసన్నవల్లి, జీ సత్యనారాయణ, ఎస్.బలుసుబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	58	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	52	ములక్కాడలు	04, 06
బెండకాయలు	50	కంద	64
పచ్చిమిర్చి	84	బీట్‌రూట్	36
కాకర కాయలు	54	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36-52	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	42